నత్తనడకన డ్రెయిన్ నిర్మాణ పనులు

- కర్రల దారిపై నడవలేక అవస్థల్లో ప్రజలు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్పొరేషన్ అధికారులు భవానీపురంలో చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. భవానీపురం స్వాతి సెంటర్‌లోని సభాపతి రోడ్ కార్నర్‌లో డ్రెయిన్ నిర్మాణం కోసం మూడునెలల కిందట షాపుల ముందు మెట్లు పగులకొట్టి వదిలేశారు. మెట్లతోపాటు షాపుల ముందున్న అరుగుల కింద కూడా తవ్వేశారు. అయితే డ్రెయిన్ నిర్మాణ పనులను మాత్రం మూడునెలలుగా పూర్తిచేయకపోతుండటంతో ఆయా షాపుల యజమానులు నానా అవస్థలుపడుతున్నారు.


స్వాతిసెంటర్ సభాపతిరోడ్ కార్నర్‌లో డ్రెయిన్ నిర్మాణం కోసం షాపుల ముందు తవ్వి వదిలేసిన వైనం

కర్రల దారే దిక్కు..

డ్రెయిన్ నిర్మాణం కోసం షాపుల ఎదుట తవ్వకాలు చేపట్టడంతో షాపులోకి రాకపోకలు సాగించేందుకు యజమానులు కర్రలతో దారి ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఈ కర్రల దారిలో నడిచే క్రమంలో పలువురు షాపుల యజమానులు, కస్టమర్లు పట్టుతప్పి పడిపోతున్నారు. దీంతో షాపుల ముందు కర్రలతో ఏర్పాటు చేసిన దారి ఉన్న షాపుల వద్ద వచ్చేందుకు కస్టమర్లు ఆసక్తిచూపకపోతుండటంతో తామ వ్యాపారాలు సాగడం లేదని యజమానులు వాపోతున్నారు. ఈ విషయంపై పలుమార్లు సచివాలయ ఉద్యోగికి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులోనూ అదే దుస్థితి..

విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లో నిర్మిస్తున్న డ్రెయిన్ నిర్మాణ పనుల కారణంగా అక్కడి నివాసితుల కష్టాలు అన్నీఇన్నీ కావు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలన్నా, తిరిగి ఇంట్లోకి రావాలన్నా కర్రలతో కట్టిన నడకదారిపై రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు ఈ కర్రల దారిపై నడవలేక పడిపోతున్నారు. డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించి మూడునెలలు గడిచినా పనులు పూర్తిచేయడంలో కాంట్రాక్టర్, కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

ముఖ్యంగా డ్రెయిన్ నిర్మాణ పనుల పేరుతో తవ్వేసినప్పుడు ఇళ్ల పునాదులు కూడా దెబ్బతింటున్నాయని, ఈక్రమంలో ఏదైనా ప్రమాదాలు చోటుచేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లో ఇప్పటివరకు చేసిన డ్రెయిన్ గోడలకు వాటర్ క్యూరింగ్ కూడా సరిగా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి డ్రెయిన్ల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తిచేయడంతోపాటు ఆయా ప్రాంతాల్లో పగులకొట్టిన మెట్లను పునర్నిర్మించేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లో ఇళ్లముందు సరైన దారిలేక ఇబ్బందులు పడుతున్న నివాసితులు


డ్రెయిన్ పనులు కారణంగా ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో దెబ్బతిన్న ఇంటి పునాదులు

క్లుప్తంగా

వెలంపల్లిని కలిసిన చంటిబాబు



భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌కు చెందిన పాదిలి చంటిబాబు శనివారం ఆపార్టీ పీఏసీ సభ్యులు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావును కృతజ్ఞతాపూర్వకంగా కలిశారు. చంటిబాబును వెలంపల్లి దుశ్శాలువతో సత్కరించారు. పార్టీ అభివృద్ధికి పనిచేసిన వారిని అధిష్టానం తప్పకుండా గుర్తించి గౌరవిస్తుందని వెలంపల్లి పేర్కొన్నారు. ఈసందర్భంగా చంటిబాబుకు పలువురు నాయకులు అభినందనలు తెలియజేశారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని నాలుగు క్లస్టర్ల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. క్లస్టర్‌లో నేర్చుకున్న విషయాలన్నీ విద్యార్థులకు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి.సోమశేఖర్, డీఎస్ఎమ్‌సీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మాతంగి కోటయ్య, వన్‌టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్, కొత్తపేటలోని ఎమ్ఎఎమ్‌సీ హైస్కూల్, విద్యాధరపురంలోని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయవాడలో వుమ్మిడి బంగారు జ్యూయలరీ ఎగ్జిబిషన్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ బందరు రోడ్డులోని లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్‌లో వుమ్మిడి బంగారు జ్యూయలర్స్ (వీబీజే) ఎగ్జిబిషన్ ఏర్పాటైంది. ప్రదర్శన, అమ్మకాలు రెండు రోజుల పాటు జరగనున్నాయి. భారతదేశపు అత్యంత విశ్వసనీయ వారసత్వ ఆభరణాల బ్రాండ్ వీబీజే అద్భుతమైన బ్రైడల్ కలెక్షన్స్ కస్టమర్లకు అందుబాటులో ఉంచింది. ప్రదర్శనలో సున్నితంగా రూపొందించిన బంగారు, వజ్రాల ఆభరణాల అద్భుతమైన శ్రేణిని ప్రదర్శించారు. వీబీజే మేనేజింగ్ పార్టనర్ అమరేంద్రన్ వుమ్మిడి ప్రదర్శన విశేషాలను వివరించారు. 'చక్కటి ఆభరణాలకు ప్రసిద్ధి చెందిన విజయవాడ నగరానికి వీబీజే అనుభవాన్ని తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రదర్శనలో వివాహ సేకరణలు, చెవి పోగులు, నెక్లెస్, చెయిన్లు, గాజులు, ఉంగరాలతో సహా విస్తృత శ్రేణి ఆభరణాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఒక్కటి అసమానమైన నైపుణ్యంతో, కచ్చితమైన శ్రద్ధతో రూపొందించి కస్టమర్లకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన 16వ తేదీ కూడా ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



మధురానగర్ (విజయవాడ సెంట్రల్): మధురానగర్‌లోని గౌతమ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన పలువురును ఆలోజింపజేసింది. ఈ ప్రదర్శనలో 205 మంది పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఆలోచనలకు పదును పెట్టి 110 ప్రాజెక్టులను ప్రదర్శించారు. రోబోటిక్స్ టెక్నాలజీ, ఈజీ లాంగ్వేజ్ సొల్యూషన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, గణిత, బయాలజీ వంటి విభాగాల్లో ఎగ్జిబిట్లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ గవర్నర్ గద్దె శేషగిరి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ గవర్నర్ శ్రీనివాస రెడ్డి, టి.శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ ఎన్‌వీవీఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు ప్రతిభా పురస్కారాలు



బస్టాండ్(విజయవాడపశ్చిమ): ప్రజారవాణాశాఖ (ఏపీఎస్ఆర్‌టీసీ)లో ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రమాదరహితంగా బస్సులను నడిపిన డ్రైవర్లకు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ప్రతిభ పురస్కారాలను అందజేశారు. విజయవాడ మెయిన్ డిపోలో శనివారం రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ల కృషి ఫలితంగా గతేడాది నుంచి ప్రమాదాలు సంఖ్య తగ్గిందన్నారు. దేశంలోని అన్ని ఆర్టీసీల కంటే 0.06 శాతం తక్కువ ప్రమాదాల రేటు ఉందంటూ ఉద్యోగులను ప్రశంసించారు. డ్రైవర్లు దురలవాట్లకు దూరంగా ఉంటూ మానసిక ప్రశాంతతో ఉండాలన్నారు. ఆర్టీసీపై ప్రజల్లో ఎంతో నమ్మకం, ఆదరణ ఉందన్నారు. భవిష్యత్‌లో ఈ నమ్మకం మరింత పెరిగేలా పనిచేయాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలని, టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జోన్-2 ఈడి విజయరత్నం, జిల్లా ప్రజారవాణ అధికారి ఏసుదానం, జిల్లా డిప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ జాన్‌సుధాకర్, పండిట్ నెహ్రూ బస్టేషన్ డిసిటిఎం ఎస్.శ్రీనివాసరావు, డిపోమేనేజర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా సాగిన నాటికల ప్రదర్శనలు

- ప్రారంభమైన జాతీయ సాంఘిక నాటికల పోటీలు
- రెండురోజులపాటు నిర్వహణ

విజయవాడ కల్చరల్: యూత్ స్పోర్ట్స్ కల్చరల్ ఫోరమ్, కళావిపంచి, శ్రీ కృష్ణా తెలుగు థియేటర్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో రెండు రోజులపాటు నిర్వహించే సాంఘిక నాటిక పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి నాటికగా మహతి క్రియేషన్స్ వారి ఉక్కు సంకెళ్ళు ప్రదర్శించారు. 1840 లో కోలకత్తాలోని ఈస్ట్ ఇండియా కంపెనీ అక్కడి జాలర్లపై పన్ను విధిస్తుంది. జాలర్లకు మద్దతునిస్తూ రాణి రాష్మోనీ ఉద్యమం చేస్తుంది. ఈ నేపథ్యంలో నాటిక సాగుతుంది. రెండవ నాటికగా హేలాపురి కల్చరల్ అసోసియేషన్ వారి సారీ రాంగ్ నంబర్ నాటికను ప్రదర్శించారు. భారతీయ వివాహవ్యవస్థకు మూలం సనాతన ధర్మమని కానీ నేడు అది తన ఉనికిని కోల్పోతోంది. మగవాడు పరస్త్రీ వ్యామోహంలో పడితే ఏం జరుగుతుందో చెప్పటమే నాటకం ప్రధాన ఉద్దేశం. మూడవ నాటికగా న్యూస్టార్ మోడరన్ థియేటర్ 27 వ మైలు రాయి ప్రదర్శించారు. కార్యక్రమాలను ఐ అండ్ పీయార్ జాయింట్ డైరెక్టర్ పోతుల కిరణ్ కుమార్ ప్రారంభించారు. సాహిత్యమైనా, నాటకమైనా, సినిమా ఐనా సామాజిక ప్రయోజనం కలిగి ఉండాలన్నారు. వివిధ రంగాలకు చెందిన హెచ్‌వీఆర్ ఎస్ ప్రసాద్, జవ్వాది దాశరథి శ్రీనివాస్, జీవీజీ శంకర్, బొప్పన నరసింహారావు, అంకం భుజంగరావు పాల్గొన్నారు.


ఉక్కు సంకెళ్ళు నాటికలోని సన్నివేశం

'నేను బెజవాడ లోకల్'


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

సినీ నటుడు రాజేంద్రప్రసాద్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'నేను బెజవాడ లోకల్... బెంజిసర్కిల్ సెంటర్‌లో పెరిగినోడిని.. వన్‌టౌన్‌లో సైకిల్‌పై తిరిగినోడిని....' అంటూ ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్ నగరంలో సందడి చేశారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ 17వ వార్షిక వేడుకలు ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం సాయంత్రం అత్యంత ఉత్తేజపూరిత వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నటుడు రాజేంద్రప్రసాద్ తన ప్రసంగంతో విద్యార్థులను ఉత్తేజపరిచారు. తాను బెజవాడ లోకల్ అంటూ సందడి చేశారు. ప్రధానంగా విద్యార్థులు తమలోని ప్రత్యేకతను గుర్తించి దానికి పదును పెట్టాలన్నారు. తాను ఇంజినీరింగ్ చదివినా, నటుడుగా ఎదగాలని శ్రమించానన్నారు. అనేక ఆటుపోటులను ఎదుర్కొనన్నారు. అలాగే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా విజయం సాధించానని వివరించారు. అలాగే విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో మంచి స్థాయి లభించే వరకూ పాటుపడాలని సూచించారు. మిమిక్రీ ఆర్టిస్ట్ భవిరి రవి వివిధ నటుల కంఠాలను అనుకరించి విద్యార్థులను అలరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలవాది మల్లికార్జునరావు, చిట్టా అమర్ సుధీర్, కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు చిట్టూరి ఆనందసుధాకర్, పొట్టి సురేంద్రకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ తదితరులు ప్రసంగించారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి.


మాట్లాడుతున్న సినీ నటుడు రాజేంద్రప్రసాద్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


ప్రజారవాణా కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న యేసుదానం, ఉద్యోగులు


షేక్ రాజాసాహెబ్ హాస్పిటల్ వద్ద స్వచ్ఛంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండేల అందరూ పనిచేయాలని జిల్లా ప్రజారవాణా అధికారి(ఏపీఎస్ఆర్టీసి) ఎం.యేసుదానం సూచించారు. పండిట్‌నెహ్రూ బస్‌స్టేషన్‌లోని జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంటిని, పరిసరాలను, పనిప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జాన్ సుధాకర్, పర్సనల్ ఆఫీసర్ పి.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రాజాసాహెబ్ ఆస్పత్రిలో..

వించిపేట(విజయవాడపశ్చిమ): కొత్తపేటలోని షేక్ రాజాసాహెబ్ ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.సి.కె. నాయక్, వైద్యులు, సిబ్బంది కలసి హాస్పిటల్ పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.సి.కె. నాయక్ మాట్లాడుతూ అందరూ తమ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లుగనే పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలుగా మూడు విభిన్న రంగుల డస్ట్‌బిన్‌లలో ఉంచి పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించాలని రోగులకు సూచించారు . పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరం ఆరోగ్యంగా ఉంటామని పేర్కొన్నారు. అనంతరం సిబ్బందిచే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంతి కిరణ్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ బిందు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి డయాబెటిస్ ఉచిత స్క్రీనింగ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తమ ఆస్పత్రిలో పదిరోజుల పాటు ఉచిత డయాబెటిస్ మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు భవానీపురంలోని భవానీ హాస్పిటల్ ఎండీ వెనిగండ్ల చంద్రశేఖర్ శనివారం తెలిపారు. వైద్యశిబిరం పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ఆదివారం నుంచి ఈనెల 25 వరకు రోజూ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల మధ్య ఈ శిబిరం కొనసాగుతుందని అన్నారు. రూ.2వేల విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పన్నులు చెల్లించండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలం, నీటి, డ్రైనేజీ పన్నులను వెంటనే చెల్లించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పన్ను చెల్లింపులకు వీఎంసీ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసిందని, ఈ కౌంటర్లు ఆదివారం, సెలవు దినాల్లో కూడా పనిచేస్తాయని చెప్పారు. ఆయా ప్రాంతాల్లోని కౌంటర్లు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లలితా సహస్ర నామ పారాయణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం లలితా సహస్ర నామ పారాయణ, శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రం, అమ్మవారి నామ పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మ వారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో హైదరాబాద్‌కు చెందిన సులోచన పౌండేషన్ ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పారాయణంలో సుమారు 350 మందికి పైగా మహిళలు పాల్గొని ఏక కంఠంతో పారాయణం చేశారు. సంస్థ వ్యవస్థాపకురాలు శైలజ పర్యవేక్షణలో పారాయణం సుమారు మూడు గంటల పాటు సాగింది. అనంతరం పారాయణంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందించారు.

మధురంగా పంచరత్న కీర్తనల గోష్టిగానం


వీణపై కీర్తనలు పలికిస్తున్న సంగీత విద్వాంసులు

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతీ సంగీత సమితి ఆధ్వర్యంలో 9 వ అఖండ కచ్ఛపీ మహోత్సవాన్ని దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు సరస్వతీదేవికి స్వరార్చన నిర్వహించారు. సద్గురు త్యాగరాజ స్వామి రచించిన ఘనరాగ పంచరత్న కీర్తనలు జగదానందకారక, దుడుకుగల, సాధించెనే ఓమనసా, కనకన రుచిరా, ఎందరో మహానుభావులు కీర్తనలు వీణపై పలికించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు కొక్కొండ సుబ్రహ్మణ్యం, కొమ్మాజొస్యుల ఉదయలక్ష్మి, జేవీఎల్ కల్యాణి, కావూరి హేమలక్ష్మి, కోట శాంకరి, అయ్యగారి సత్యప్రసాద్, కేఎస్ గోవిందరాజన్ తదితలు వాగ్గేయ కారుల కీర్తనలు ఆలపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ జెన్‌కొ ఎండీ కేవీఎస్ చక్రధర్ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి పూర్వవైభవం తీసుకురావాలన్నారు. ఏటా అఖండ కచ్ఛపీ మహోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. సంగీత సమితి వ్యవస్థాపక కార్యదర్శి సీవీ రావ్, వైస్ చైర్మన్ చిట్టా రామలక్ష్మి నిర్వహించారు. సంగీత విద్వాంసులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

మిల్క్ యూనియన్‌పై నిరాధార ఆరోపణలు తగవు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కృష్ణామిల్క్ యూనియన్‌పై కవులూరు పాల సహకార సంఘ అధ్యక్షులు తాడికొండ రమేష్‌బాబు నిరాధార ఆరోపణలు చేయడం తగదని బోర్డు డైరెక్టర్లు పేర్కొన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో డైరెక్టర్లు దాసరి వెంకట బాలవర్ధనరావు, వేమూరి సాయి వెంకటరమణ మాట్లాడుతూ విజయ బ్రాండ్ అనేది ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి సహకార సంస్థ అని పేర్కొన్నారు. ఈ బ్రాండ్‌ని రాష్ట్రవ్యాప్తంగా పలు సంస్థలు వినియోగిస్తున్నాయన్నారు. ప్రతి ఉత్పత్తిపై కృష్ణా మిల్క్ యూనియన్, విజయ డెయిరీ, రెండు లక్షల పాడిరైతుల సంస్థ అని ముద్రిస్తున్నామన్నారు. 2019 నుంచి యూనియన్ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి లీటర్‌కు రూ.26 పాల సేకరణ ధరను పెంచడం జరిగిందన్నారు. పాడి రైతులకు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి బోనస్ చెల్లిస్తున్నామన్నారు. గతంలో పోలిస్తే లీటర్‌కు రూ.15ల నుంచి రూ. 18ల వరకు అధికంగా చెల్లిస్తున్నామని వివరించారు. విజయ డెయిరీలో ఉత్పత్తి చేసే ప్రతి పాల పదార్థాలకు అవసరమైన పరీక్షలు చేయిస్తున్నామని, యూనియన్‌లో జరిగే ప్రతి లావాదేవి టెండర్ల ప్రక్రియ ద్వారానే నిర్వహిస్తున్నామని వివరించారు. పశుపోషకులకు సబ్సిడీపై నాణ్యమైన పశుదాణాను అందిస్తున్నామన్నారు. యూనియన్‌కు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్నా బోర్డు జనరల్ బాడీ సమావేశంలో అడిగి తెలుసుకోవచ్చని సూచించారు. అయితే కొంత మంది సమితి దీర్ఘకాలిక ప్రయోజనాలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని, అటువంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డైరెక్టర్లు పల్లగాని కొండలరావు, బొట్టు రామచంద్రరావు, ఆర్జా వెంకటనగేష్, నెలకుదిటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మిల్క్ యూనియన్ డైరెక్టర్లు

పరిసరాల శుభ్రతతో పర్యావరణ పరిరక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): పర్యావరణ పరిరక్షణతో పాటు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రంగా ఉంచడంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా సిద్ధార్థ కళాశాల ఎకోక్లబ్ విద్యార్థులతో కలిసి, ఏపీఐఐసీ కాలనీ రోడ్డు, రైతు బజార్‌తో పాటు పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. తడిచెత్త, పొడిచెత్తను విడివిడిగా డబ్బాల్లో వేసి మున్సిపల్ కార్పొరేషన్ వారికి అప్పగించడం వంటి వాటిపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి శర్వణనన్, చీఫ్ ఇంజినీర్ పి. ప్రసాదరావు, పర్యావరణ ఇంజినీర్ పి.శ్రీనివాస్, సీనియర్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ వెన్నెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వంటల పోటీలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక మధు చౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళాఉత్సవ్-2025 ఆదివారం సాయంత్రంతో ముగియనుంది. ఈ నెల 8వ తేదీ మహిళా ఉత్సవ్ ప్రారంభమైంది. మహిళలు స్వయంగా తయారు చేసిన వివిధ ఉత్పత్తులను ప్రదర్శనతో పాటుగా అమ్మకాలు చేస్తున్నారు. నగరంతో పాటుగా పరిసర ప్రాంతాల నుంచి 50కు పైగా దుకాణాలను ఏర్పాటు చేశారని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ చెప్పారు. మహిళలు వ్యాపార మెలకువలను నేర్చుకోవడంతోపాటుగా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఇలాంటి మహిళా ఉత్సవ్‌లు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. మహిళల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి మహిళా ఉత్సవ్ ఆవరణలో సంప్రదాయ వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 14 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని ఎస్.మేఘన, ద్వితీయ బహుమతి ఎన్.అరుణకుమారి, మూడో బహుమతిని సత్యశ్రీ గెలుపొందారు.